ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుండి 8.30 వరకు
సా.4 గం.నుండి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుండి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 168 | బుధవారం 18 మార్చి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

## మాకెవరిసాయం అక్కర్లేదు

- అమెరికా చాలా శక్తివంతమైన దేశం..
- హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం..
- మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక..



**వాషింగ్టన్(తెలుగోడు), మార్చి 17 :** హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా (మిగతా 2లో)

## కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

**పాక్ తీరును తీవ్రంగా తప్పుపట్టిన భారత్**



**న్యూఢిల్లీ (తెలుగోడు), మార్చి 17 :** అఫ్ఘానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ (మిగతా 2లో)



# రైట్..రైట్.. దివ్యాంగులకు ఫ్రీ

- ఉగాది కానుకగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...
- దివ్యాంగ శక్తి పథకంతో లక్షల మందికి లబ్ధి..
- సహాయకులకు 50 శాతం టికెట్ రాయితీ..
- 40 శాతం పైగా వైకల్యం ఉన్నవారికి వర్తింపు..
- ఏడాదికి రూ.207 కోట్లు భారం భరించనున్న ప్రభుత్వం..
- స్త్రీ శక్తి పథకం తరహాలో మరో సంక్షేమ పథకం..
- దివ్యాంగులతో కలిసి ప్రయాణం, ఆత్మీయ విందులో పాల్గొననున్న సిఎం..

**అమరావతి (తెలుగోడు), మార్చి 17 :** రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన స్త్రీ శక్తి పథకం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో, ఇప్పుడు దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందించే దివ్యాంగ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది. ఉగాది పండగ కానుకగా ఈ పథకాన్ని బుధవారం మంగళగిరిలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, ఐటీ మంత్రి, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొననున్నారు. పథకం ప్రారంభం అనంతరం దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి మరియు ఇతర ప్రముఖులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించనున్నారు. అనంతరం దివ్యాంగులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేయనున్నారు. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు కూడా ఈ పథకాన్ని ప్రారంభించి, దివ్యాంగులతో కలిసి బస్సుల్లో ప్రయాణించనున్నారు. ఆ తర్వాత వారితో కలిసి భోజనం చేయనున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 11.16 లక్షల మంది దివ్యాంగులకు ప్రత్యక్ష లబ్ధి కలగనుంది. మొత్తం 12.76 లక్షల మంది దివ్యాంగులతో పాటు వారి సహాయకులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి 50 శాతం టికెట్ రాయితీ కల్పించనున్నారు. 40 శాతం పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఈ పథకం వర్తించనుంది. మొత్తం 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులను ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. పథకం అమలుకు ప్రభుత్వం ఏడాదికి రూ.207 కోట్లను ఆర్టీసీకి 2లో

## డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ పుట్టా పార్లమెంట్ చరిత్రలోనే మొదటి ఎంపీ

**అయినా ఎంపి పుట్టా మహేశ్‌పై చర్యలేవీ**
**ఇదే చంద్రబాబు తరహా రాజకీయాలు**
**మండిపడ్డ వైసిపి అధినేత జగన్**




**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 17 :** పార్లమెంట్ చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ పుట్టా మహేషే అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. ఈ వ్యవహారం పుట్టా మహేష్‌తో మొదలై, పుట్టా మహేష్‌తో ఆగిపోలేదన్నారు. (మిగతా 2లో)

## రాష్ట్రంలో 14వేల టన్నుల గ్యాస్ నిల్వలు

**త్వరలోనే మరింత గ్యాస్ సరఫరా**

**మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల**



**అమరావతి (తెలుగోడు), మార్చి 17 :** రాష్ట్రంలో ప్రస్తుతం 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరికొన్ని టన్నుల గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి వస్తుంద న్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బంది లేవని, ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. (మిగతా 2లో)

## అరటి ఎగుమతుల ఊసేలేదు



**దేశీయంగా ముందుకు రాని కొనుగోలుదారులు..**

**ఆందోళనలో అనంతపురం జిల్లా అరటి రైతులు**

**అనంతపురం (తెలుగోడు), మార్చి 17 :** పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న యుద్ధంతో అరటి రైతులు కుదేలవుతున్నారు. ఎగుములు ఆగి, ధరలు పడిపోవడంతో పలు చోట్ల అరటి రైతులు ఆందోళనకు దిగారు. తమ పంటలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. 20 రోజుల క్రితం ఆశాజనకంగా ఉన్న అరటి ధర ఉన్నఫలంగా పడిపోయింది. కిలో రూ.5కు కూడా కొనే నాథుడు కరువవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అరటి సాగు గణనీయంగా ఉంది. తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దాదాపు 47 వేల ఎకరాల్లో ఈ ఏడాది అరటి సాగైంది. ఫిబ్రవరిలో కిలో రూ.22 నుంచి రూ.24 వరకు ధర పలికింది. వారం రోజులుగా అరటిపై యుద్ధం నీడలు కమ్ముకోవడంతో ఎగుమతి పూర్తిగా ఆగి పోయింది. కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతదో తోటల్లోనే అరటి కాయలు వాడిపోతున్నాయి. ఎకరా విస్తీర్ణంలో (మిగతా 2లో)

# గుండె ధైర్యమే వైఎస్సార్సీపీ ట్రేడ్ మార్క్

- వైఎస్సార్సీపీ ఒక్కరి పార్టీ కాదు.. అందరి కృషితో నిర్మాణం..
- ప్రజల విశ్వాసమే పార్టీకి బలమైన పునాది ..
- తమ పాలనకు, నారా చంద్రబాబు పాలనకు మధ్య తేడా ప్రజలు గుర్తించారు..
- హామీల అమలులో దేశానికి ఆదర్శంగా నిలిచాం..
- ప్రస్తుత పాలనలో అవినీతి, నిర్లక్ష్యం పెరిగిందన్న జగన్...

**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 17 :** గుండె ధైర్యమే వైఎస్సార్సీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కేడర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు ఇంఛార్జి చుండూరు రవి, పార్లమెంటు ఇంఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్సీపీ ఒక వ్యక్తి పార్టీ కాదని, అందరూ కలిసి నిర్మించుకున్న ఉద్యమమని చెప్పారు. పార్టీ విలువలు, విశ్వసనీయత పునాదులపై ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. మంచి చేశామని నమ్మకం ఉన్నందుకే ప్రజలతో కలిసి ముందుకు మిగతా 2లో



## ప్రభుత్వ పాఠశాలలో భోజనం అధ్వాన్నం

**ఫిర్యాదు అందడంతో లోకేశ్ ఆకస్మిక తనిఖీ**



**విజయవాడ(తెలుగోడు), మార్చి 17 :** మైలవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం భోజనం అంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో తారక రామానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంపై విద్యార్థులను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. 'భోజనం రోజూ బాగోవడం లేదా? ఆ ఒక్క రోజే బాగోలేదా?' అంటూ విద్యార్థులను ఈ సందర్భంగా ప్రశ్నించారు. పాఠశాలలో భోజనం బాగుంటుందంటూ మంత్రికి బదులిచ్చారు విద్యార్థులు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఆ తర్వాత (మిగతా 2లో)

## రైతులను ఆదుకోవడంలో కూటమి విఫలం

**మండిపడ్డ మాజీమంత్రి సాకే శైలజానాథ్**



**అమరావతి (తెలుగోడు), మార్చి 17 :** ఏపీలో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వ్యవసాయం దండగ అనే రీతిలోనే ఇప్పటికీ చంద్రబాబు ఆలోచిస్తున్నారంటూ దుయ్యబట్టారు. సగటున రోజుకు 8 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభమే ఈ ఆత్మహత్యలకు కారణం. విపత్తులు వచ్చినా ప్రభుత్వం మాటలు తప్ప.. లబ్ది చేకూర్చడం లేదు. ఎన్నికల ముందు రైతులకు, రైతు కూలీలకు అనేక హామీలు ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అరకొర మినహా ఏ పంటకు గిట్టుబాటు (మిగతా 2లో)

## మత్స్యకారుల కోసమే సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్

**కలెక్టరేట్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర**



**నెల్లూరు (తెలుగోడు), మార్చి 17 :** జువ్వలదిన్నెలో ఏర్పడుతున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్ మత్స్యకారులకు ఎంతో మేలు చేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ.2500 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. మత్స్యకారులు కేవలం వృత్తిపరంగా మాత్రమే కాకుండా పారిశ్రామికవేత్తలుగానూ ఎదగాలని సూచించారు. ఇందుకోసం 125 ఎకరాల భూమిని అందుబాటులో ఉంచి పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిపై కలెక్టరేట్‌లో మత్స్యకార నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను మంత్రి కొల్లు రవీంద్ర (మిగతా 2లో)

## వివేకా హత్యకేసును పక్కదారి పట్టించే యత్నం

**జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని**



**అమరావతి (తెలుగోడు), మార్చి 17 :** మంత్రి వివేకా హత్య కేసులో నిందితులను కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. సొంత బాబాయ్ హత్య కేసులో నిందితులతో ప్రెస్‌మీట్లు పెట్టించడం జగన్ దిగజారుడు తనానికి పరాకాష్ఠ అని విమర్శించారు. 'అబద్దాల పునాదుల మీద పుట్టిన పార్టీ వైసీపీ.. బాబాయ్‌ను చంపింది ఎవరో తెలిసినా సాక్ష్యాలు చెరిపేయడమే మీ పనా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గుండెపోటు థియరీ నుంచి గొడ్డలి వేటు వరకు గంటకో మాట మార్చిన 'జగన్నాటకం' గూగుల్ టేకవుట్‌లో (మిగతా 2లో)

# మాకెవరిసాయం అక్కర్లేదు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# మత్స్యకారుల కోసమే సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్



(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై మత్స్యకారులలో ఉన్న అనుమానాలను సమావేశంలో నివృత్తి చేసినట్లు మంత్రి తెలిపారు. మంచి ప్రాసెసింగ్ చేసిన చేపల ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, దీని ద్వారా మత్స్యకారులకు అధిక లాభాలు చేకూరుతాయని చెప్పారు. సాగర్ డిఫెన్స్ కంపెనీ కొంత భూమినే కోరిందని, మిగిలిన ప్రాంతం మత్స్యకారుల ప్రయోజనాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. అదే సమయంలో వైసీపీ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి విమర్శించారు. పరిశ్రమలు రావడం వల్ల యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, గత పాలనలో పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో పరిశ్రమలు తిరిగి వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంకటకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. ఫిషింగ్ హార్బర్‌లు.. మత్స్యకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన గొప్ప కానుక అని అన్నారు. హార్బర్‌లకు అనుసంధానంగా పరిశ్రమలు రావాలని ప్రస్తుత ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చినందుకు చంద్రబాబు, నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ.. కృష్ణపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఏర్పడిందని, దీనికి అనుబంధంగా అనేక పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. త్వరలోనే ఈ హార్బర్ పూర్తిస్థాయిలో మత్స్యకారులకు అందుబాటులోకి రానుందని తెలిపారు. వైసీపీ ఆరోపిస్తున్నట్లు హార్బర్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, వారికి న్యాయం జరిగేలా చూస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

# ముస్లీం మైనార్టీలకు అండగా కూటమి

## పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డి



నల్లమాడ (తెలుగోడు), మార్చి 17 :

ముస్లీం మైనార్టీలకు ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా మండల కేంద్రమైన నల్లమాడలోని హైస్కూల్ సమీపంలోని ముస్లిం కాలనీలో రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం కుటుంబాలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మైనార్టీ జిల్లా నాయకుడు సలాం ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని కొనియాడారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలతో ఎంతో పవిత్రంగా పండుగను జరుపుకుంటారని తెలిపారు. అల్లాహ్ దయతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. 2014లో తనకు మైనార్టీ మంత్రిగా పనిచేసే అవకాశం కల్పించిన చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. పేద ముస్లిం యువతుల వివాహాలకు "దుల్హన్" పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హజ్ యాత్రకు, మక్కా మసీదు సందర్శనకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. మసీదుల మరమ్మతులకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం నల్లమాడ సర్కిల్‌లో కీ శే. పల్లె ఉమా జ్ఞాపకార్థంగా ఆర్టీసీ బస్ షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.

### స్వచ్ఛ రథం ప్రారంభం

నల్లమాడ మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల సహకారం లేకుండా పరిశుభ్రత సాధ్యం కాదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మనోజ్ కుమార్, ఎంపీడీవో అంజనప్ప, టిడిపి నాయకులు సొసైటీ అధ్యక్షులు గడ్డం రమణారెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్ రఫీ, బాబావలిఖాన్, టీడీపీ నాయకులు బుట్టి నాగభూషణం, తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఆసుపత్రిపై దాడి పిరికిపంద చర్య



(మొదటి పేజీ తరువాయి)

మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఎ÷–గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విపత్కర సమయంలో ఆ దేశ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.

# పార్లమెంట్ చరిత్రలోనే ఇదే తొలిసారి

(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం అని మండిపడ్డారు. తప్పు చేసిన వారిపట్ల చంద్రబాబు చర్యలు తీసుకోలేదని, అందుకే రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందాలు జరుగుతున్నాయని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం అత్యాచారాలు, మోసాలపై కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. కోనేటి ఆదిమూలం మహిళపై లైంగిక దాడిచేస్తే చర్యలు లేవని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డాడు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం. ఒక పాలకుడిగా ఆయన వ్యవహరించలేదు. తప్పు చేసిన వారిపట్ల తయన చర్యలు తీసుకోలేదు. అందుకనే విచ్చలవిడిగా జరుగుతున్నాయి. అత్యాచారాం చేశారని, ఆపై మోసం చేశారని బాధితురాలు స్వయంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే.. దానిపై కమిటీలు అంట. కోనేటి ఆదిమూలం మహిళ మీద దారుణమైన లైంగిక దాడిచేస్తే పంచాయితీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. మహిళలతో అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీదా నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీదా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా.. నో యాక్షన్' అంటూ వైఎస్ జగన్ ÷ర్ అయ్యారు. 'ఆదినారాయణ రెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే నో యాక్షన్. ఇలాంటి వాటికి వత్తాసు పలికే భావన సీఎం చంద్రబాబుకు ఉంది కాబట్టే.. ఇలాంటివి జరుగుతున్నాయి. తన కొడుకు స్విమ్మింగ్ పూల్స్ వద్ద తాగుతూ, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్‌లు చూస్తే నో యాక్షన్. తన బావమరిది అమ్మాయిలకు ముద్దైనా పెట్టాలి, కడుపైనా చేయాలని అని బహిరంగంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని చంద్రబాబు అన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. లాగి చెంపకేసి ఒక్కటి పీకాల్సింది పోయి... చేసిందేమిటన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో 14వేల టన్నుల గ్యాస్ నిల్వలు



(మొదటి పేజీ తరువాయి)

గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజీఎస్ నుంచి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు ప్యానిక్ అవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్‌లను పెంచేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంచి, మెరుగైన పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷ూష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలని పేర్కొన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్ఠంగా పెంచే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సమావేశానంతరం ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. 100 శాతం ప్రజలకు గ్యాస్ అందిస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉండేవారని.. ఇప్పుడు వారు ఆరోగ్యశాఖ కిందకు మారినట్లు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత ఉందని... వాటిని త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడ అక్రమ రవాణా జరుగుతున్నా ఉక్కుపాదం మోపుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాష్ట్రంలో గృహావసరాల కోసం ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటుగా 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు జరుగుతాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 2.92 లక్షల సిలిండర్లను సరఫరా చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి ఒక్కసారిగా ఎక్కువ బుకింగ్‌లు చేయడంతో సర్వర్లు జామ్ అవుతున్నాయని చెప్పారు. కేంద్ర నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాతే మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు అనుమతి ఉంటుందని గుర్తు చేశారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకుఓటీపీ ద్వారా మాత్రమే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే విధానం అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే 616 కేసులు నమోదు చేసి 2500 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి గ్యాస్ సరఫరాను పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు యాప్, ఫోన్ కాల్, వాట్సాప్, మిస్డ్ కాల్ లేదా ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని మంత్రి సూచించారు. ÷–రజలు పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

# రైట్.. రైట్... దివ్యాంగులకు ఫ్రీ

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించనుంది. స్త్రీ శక్తి బస్సుల్లోనే దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడుతుంది. ఇప్పటికే స్త్రీ శక్తి పథకం ద్వారా కోట్లాది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఈ పథకం అమలుతో భారీ వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తోంది. అదే తరహాలో దివ్యాంగ శక్తి పథకం ద్వారా కూడా సామాజిక సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని ముందుగానే ప్రకటించిన ప్రభుత్వం, ఉగాది పండగకు ముందు రోజు ఈ పథకాన్ని ప్రారంభించడం ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక కానుక అందిస్తోంది. ఈ చర్యతో రాష్ట్రంలో దివ్యాంగుల ప్రయాణ సౌకర్యాలు మరింత సులభతరం కానున్నాయి.

# అరటి ఎగుమతుల ఊసేలేదు

(మొదటి పేజీ తరువాయి)

అరటి సాగు, కోత కూలి కలుపుకొని సుమారు రూ.1.40 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తోంది. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు లక్ష రూపాయలు మాత్రమే వచ్చే అవకాశముంది. అది కూడా మొదటి పంట అయితేనే ఈ ధర వస్తుంది. పంట కొనుగోలుకు వ్యాపారి వస్తేనే ఇది సాధ్యమవుతుంది. లేదంటే ఎండ తీవ్రతకు నెల రోజుల్లో గెలలు నేలకొరిగే ప్రమాదం ఉంది. రెండు, మూడో ఏడాది పంటను అడిగేవారు కరువయ్యారు. మైక్రోసన్ అరటిని సాగు చేసిన వారి పొలాల్లో పంట కోత దశలో నాణ్యతగా ఉంది. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. వారం ముందు వరకు వ్యాపారులు టన్ను రూ.20 వేలకు అడిగారు. ప్రస్తుతం వారికి ఫోన్ చేస్తే ధర పడిపోయిందంటూ టన్ను ఐదు వేల రూపాయలకు కూడా కొనుగోలుకు ముందుకురావడం లేదని వాపోతున్నారు. పంట కోయకపోతే గెలలు నేలకొరిగిపోయి పూర్తిగా నష్టపోతామని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో భోజనం అద్వాన్నం

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం ఆయన సందర్శించారు. అందులోని చిన్న పిల్లలతో లోకేశ్ ముచ్చటించారు. ఆ తర్వాత పాఠశాల స్థితిగతులపై మైలవరం ఎంఈవో, హెడ్‌మాస్టర్‌తో లోకేశ్ మాట్లాడారు. ఆ క్రమంలో తనతో పాటు తెచ్చిన నివేదికపై ఎంఈఓతో లోకేశ్ చర్చించినట్లు తెలుస్తోంది. స్నతాధికారులు, పార్టీ శ్రేణులుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రి లోకేశ్ ఈ పాఠశాలను సందర్శించారు. లోకేశ్ పర్యటనపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కూ ఎలాంటి సమాచారం అందలేదని తెలుస్తోంది. మంత్రి లోకేశ్ రాకను తెలుసుకున్న విద్యా శాఖ అధికారులు మైలవరానికి పరుగులు తీశారు.

# రైతుల్ని ఆదుకోవడంలో కూటమి విఫలం

(మొదటి పేజీ తరువాయి)

ధరలు లేవని అన్నారు. మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చినా ధరల స్థిరీకరణ నిధికి రూ.3,000 కోట్లు కూడా కేటాయించలేదు. వైఎస్సార్, జగన్ పరిపాలనలో రైతే రాజు అన్నట్లుగా పరిస్థితులు ఉండేవి. క్రాప్ ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించక రైతులు విపత్తులతో నష్టపోయారు. అన్నంపెట్టే రైతుల సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వం వెంటనే స్పందించాలి. చిన్న, సన్నకారు రైతాంగాన్ని ఆదుకోవాలి' అని సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు.

# వివేకా హత్యకేసును పక్కదారి పట్టించే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

బట్టబయలైందని మంత్రి వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ వద్దని, నిందితుడు అవినాశ్ రెడ్డిని కాపాడటానికి బాంబులతో బెదిరిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న వివేకా కన్నకూతురు సునీతమ్మపై అక్రమ సంబంధాల ముద్ర వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ కావాలన్నారు.. అధికారంలోకి వచ్చాక సీబీఐని తరిమికొట్టారు, ఇదేనా మీ నీతి' అంటూ మంత్రి విరుచుకుపడ్డారు. త్య జరిగిన చోట రక్తపు మరకలను చెరిపేసి ఇంకో రకంగా చిత్రీకరించిన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిది అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. 'హత్య కేసును ఆస్తి, అక్రమ సంబంధాల వైపు తిప్పడం.. అసలు నిందితులను కాపాడేందుకేనా ఈ డ్రామా?' అని ప్రశ్నించారు. 15 రోజులకోసారి పక్క రాష్ట్రాల నుంచి వచ్చి 3 గంటలు అబద్దాలు చెబితే ప్రజలు నమ్మే రోజులు పోయాయని అన్నారు. ప్రజల మీద, కుటుంబ సభ్యుల మీద ప్రేమ లేదని.. కేవలం దోచుకున్న వారిని కాపాడటమే వైసీపీ ఏకైక అజెండా అని ఆరోపించారు. ఐదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు వాస్తవాలను జగన్ ఏమార్చారు. అధికారం పోయాక బలప్రదర్శన చేస్తున్నారే తప్ప ప్రజలపై ప్రేమ లేదు. జగన్ చెప్పే అబద్దాలు నమ్మకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు' అని అనగాని అన్నారు. ఈ సందర్భంగా వివేకా హత్యపై జగన్, అవినాష్‌రెడ్డి వ్యాఖ్యల వీడియోలు ప్రదర్శించారు.

# గుండె ధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్

(మొదటి పేజీ తరువాయి)



వెళ్తున్నామని అన్నారు. తమ పాలనకు, నారా చంద్రబాబు నాయుడు పాలనకు మధ్య తేడా ప్రజలు స్పష్టంగా గుర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, అవినీతి కోసం మాత్రమే పాలన సాగుతోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ఖజానా దెబ్బతిన్న స్థితిలో ఉందని, కోవిడ్ వంటి కష్టకాలంలోనూ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశామని, ముందుగానే క్యాలెండర్ ప్రకటించి అమలు చేశామని గుర్తుచేశారు. తమ హయాంలో తీసుకున్న అప్పుల్లో ఎక్కువ భాగాన్ని ప్రజల సంక్షేమానికి వినియోగించామని, మహిళల ఖాతాల్లోనే భారీ మొత్తాలు జమ చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన అప్పులు వేగంగా పెరుగుతున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేసి ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయో ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు సరిగా రావడం లేదని, అమరావతి పనుల్లో అవినీతి పెరిగిందని ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా పనిచేయడం లేదని, ప్రజల సమస్యలకు స్పందన లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. అలాగే పలు ఘటనల్లో చర్యలు తీసుకోకపోవడం ద్వారా పాలకుల వైఖరి బయటపడుతోందని అన్నారు. మహిళలపై జరుగుతున్న ఘటనల్లో సరైన చర్యలు తీసుకోవడం లేదని, వివిధ అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలకు మంచి చేయాలనే మనస్తత్వం ప్రస్తుత పాలకులకు లేదని తీవ్రంగా ఆరోపించారు.



ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన యాడికి విద్యార్థిని కీర్తన

# ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన యాడికి విద్యార్థిని కీర్తన

**యాడికి (తెలుగోడు), మార్చి 17 :**
యాడికి మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని రాజ సాయిమణి కీర్తన గంగవరం అరుదైన గౌరవం పొందింది. రవీంద్ర ఇంజనీరింగ్ ఉమెన్స్ ఇంజనీరింగ్ క్యాంపస్ జేఎన్టీయూ తరఫున నాగాలాండ్ రాష్ట్రం రాజధాని నాగాలాండ్‌లో జరిగే ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌కు గుడ్ ఇంప్రెషన్ స్పీచ్ వ్యాఖ్యాతగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ విభాగం నుంచి ఎంపికైన నలుగురిలో కీర్తన ఒకరు. ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్‌కు తమ కూతురు కీర్తన ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని ఆమె తండ్రి గంగవరం శ్రీధర్ తెలియజేశారు.


ఇఫ్తార్ ప్రార్థనల్లో పాల్గొన్న కలెక్టర్, నాయకులు

# జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా రంజాన్ ఇఫ్తార్ విందు

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 17 :**
అనంతపురం నగరంలోని డా.బిఆర్.అంబేద్కర్ భవన్‌లో మంగళవారం సాయంత్రం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ ఇఫ్తార్ విందు – 2026 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ఎం.కేశవరెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి , జిల్లా టిడిపి కమిటీ నాయకులు, పలువురు డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముస్లింలు నమాజ్ చేసి ఉపవాస దీక్షలు విరమించగా, వారితో పాటు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఆర్టీసీ జోనల్ చైర్మన్, తదితరులు నమాజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ముస్లింల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ముస్లింలకు పెద్దపీట వేస్తున్నారని పూల నాగరాజు పేర్కొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్, నాయకులు

# బోర్ బావిలో సమృద్ధిగా నీరు

### అవినకుంటలో తీరనున్న నీటి సమస్య ..
### ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, తిప్పేస్వామికి కృతజ్ఞతలు ..

**రోళ్ల (తెలుగోడు), మార్చి 17 :**
మండలంలోని అవినాకుంట గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కానుంది. ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాలతో తవ్విన బోర్ బావిలో సమృద్ధిగా నీళ్లు లభ్యం కావడం తో ప్రజలు అనందోత్సవన్నీ వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలం నుంచి గ్రామం లో నీటి సమస్య ఉండడం తో తాము తీవ్ర ఇబ్బందులు పడ్డామని తెలియజేసారు. నీటి సమస్య ఉన్నా విషయాన్ని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లడం తో మంగళవారం తమ గ్రామానికి బోర్ వెల్ ని పంపించి బోర్ బావిని తవ్వించారని దీంతో తమకు నీటి సమస్య తీరానుందని గ్రామ మహిళలు, ప్రజలు కేరింతలు కొడుతూ అనందోత్సవాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎం ఎస్ రాజుకి , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కి మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


బోర్ బావి నుంచి పుష్కలంగా వస్తున్న నీళ్లు. గంగ పూజ చేస్తున్న మహిళలు

# నాగరాజు కుటుంబానికి రక్షణ కల్పించాలి

### నాగరాజు కుటుంబానికి పరామర్శ..
### బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్..
### స్టేట్ సెల్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి ..

**కనేకల్ (తెలుగోడు), మార్చి 17 :**
భూ వివాదంపై ఇటీవలే ప్రత్యర్థుల చేతిలో గాయపడిన మండల బిజెపి సహాయ కార్యదర్శి నాగరాజు కుమారుడు, కోడలు వారి కుటుంబ సభ్యులను బిజెపి నాయకులు మంగళవారం పరామర్శించారు. మండల పరిధిలోని బ్రహ్మసముద్రం గ్రామంలో నాగరాజు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని వారు నాగరాజు కుటుంబానికి హామీ ఇచ్చారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. మండల ఉపాధ్యక్షులు నాగరాజు తివారికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి కొంతమంది ఈనెల 14వ తేదీ నాగరాజు, అతని కుమారుడు, కోడలిపై దాడి చేశారు. కుటుంబ సభ్యులను అసభ్యకర పదజాలంతో దూషించి కొట్టారు.


మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ అధికారులు బాధితులకు న్యాయం చేయకుండా ఏకపక్షాన వ్యవహరించి పరిష్కారాలు చేయడం తగదు అన్నారు. నాగరాజుకు సంబంధించిన 25 సెంట్లు భూమికి అడంగల్ పట్టాదార్ పాస్ పుస్తకాలు రిజిస్టర్ దస్తావేజులు ఉన్నప్పటికీ తాసిల్దార్ పోలీసులు ప్రత్యర్థులకు సహకరించడం మూర్ఖపు చర్య అన్నారు. ఈ సందర్భంగా కొనకొండ్ల రాజేష్ స్టేట్ సెల్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి ఎమ్మార్వో బ్రహ్మయ్య మరియు రూరల్ సీఐ వెంకటరమణ తో ఫోన్లో ఘటనపై మాట్లాడారు. బాధితుడు నాగరాజుకు అన్ని రకాల చట్టపరమైన దస్తావేజులు అడంగల్ పట్టాదార్ పాస్ బుక్ ఉన్నప్పటికీ మీరు ఎందుకు బాధితులకు న్యాయం చేయడం లేదని నిలదీశారు. రెవెన్యూ అధికారులు పోలీసు అధికారులు చేసే తప్పుల వల్ల గ్రామాలలో గొడవలు జరిగి చంపుకునే స్థాయి వరకు పరిస్థితి వెళ్తుందని దీనికి కారణం మీరు అవుతారని నిలదీశారు. అన్ని దస్త్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ నాగరాజుకు మీరు ఎందుకు ప్రొటెక్షన్ ఇవ్వడం లేదని తాసిల్దార్ రమ్మను అడిగారు. బాలిక కుటుంబానికి తక్షణ రక్షణ కల్పించాలని అక్రమంగా భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేశారు. ఎవరిపక్క న్యాయం ఉంటే వారికి న్యాయం చేయాలని అధికారంలో ఉన్నాము కదా అని మాకు న్యాయం చేయమని అధికారులను కోరడం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు బెదిరింపులు సరైనవి కాదని అన్నారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకూ బిజెపి అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మార్వో బ్రహ్మయ్య సమస్యలను సీరియస్ గా తీసుకుని పది రోజుల్లో పూర్తిస్థాయి విచారణ జరిపి సమస్యకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బాధిత కుటుంబానికి తక్షణ రక్షణ కల్పించేందుకు పోలీస్ శాఖకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతం ప్రధాన రహదారిపై నడుస్తూ మోడీ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కుటుంబం ప్రభుత్వం ప్రజలకు న్యాయం చేస్తుందని ఎవరో కొంతమంది ఆకతాయిలు చేసే రాజకీయాలకు అధికారులు దిగజారిపోయి వ్యవహరించొద్దని రాజేష్ పదేపదే అధికారులకు విజ్ఞప్తి చేశారు. పది రోజుల్లో బాధితులకి న్యాయం చేయకపోతే సమాధానం వేరేలా ఉంటుందని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వసుందరమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దామోదర్, యువమోర్చా అధ్యక్షులు తేజస్వి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, జిల్లా కార్యదర్శిలు కరణం నాగేంద్ర, అరుణ, సీనియర్ నాయకులు హీరోజీ రావు, ఆంబోజీ రావు, మండల అధ్యక్షులు తిప్పేస్వామి,మండల కార్యదర్శి కాంత్ కుమార్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య చౌదరి, ఓబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వినాయక స్వామి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి నేత్రావతి, విజయ్ కుమార్, తిప్పారెడ్డి, యువమోర్చా నాయకులు అఖిల్ నాయకుడు, యశ్వంత్, మాజీ మండల అధ్యక్షుడు గుమ్మగట్ట హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బిజెపి నాయకులు. ర్యాలీ నిర్వహిస్తున్న బిజెపి నాయకులు

# గ్యాస్ కోసం పడిగాపులు..

### ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూ..

**యాడికి (తెలుగోడు), మార్చి 17 :**
యాడికి మండలంలో గ్యాస్ సమస్య తీవంగా ఉండడంతో మంగళవారం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ప్రజలు క్యూ కట్టారు. మంగళవారం కమలపాడు రోడ్డులో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ వద్ద తెల్లవారుజామున నుండే ప్రజలు ఖాళీ సిలిండర్‌లతో క్యూ కట్టారు దాదాపు 300 మంది క్యూ కట్టగా దాదాపు 180 సిలిండర్లు పంపిణీ చేశారు. గ్యాస్ కోసం మండలంలోని ప్రజలు భారీ సంఖ్యలో రావడంతో వేమలపాడు రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయింది.


గ్యాస్ బండ తీసుకువెళ్తున్న వినియోగదారుడు


యాడికిలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్లతో క్యూ కట్టిన ప్రజలు

# కెప్టెన్ దీపికకు ఇంటినివేశ స్థలం పట్టా పంపిణీ

### ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 17 :**
భారత మహిళా అందుల క్రికెట్ జట్టు కెప్టెన్ టిసి దీపికకు ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రమైన హేమావతిలో ఆమెకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటినివేశం స్థలం 05సెంట్లు భూమి పట్టాను మంగళవారం ఎమ్మెల్యే,టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేసారు. అమరాపురం మండలం,హేమావతి పంచాయతిలోని తంబాళహట్టి గ్రామానికి చెందిన దీపిక వారి కుటుంబం నివాసం ఉండేందుకు హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి వారి క్షేత్రంలోనే ఇంటి నివేశ స్థలం మంజూరు చేయడం విశేషం.ఈ సందర్భంగా దీపిక స్వగ్రామమైనా తంబాళహట్టి గ్రామానికి స్థానిక తహసీల్దార్ లక్ష్మీ నరసింహం,ఎం ఆర్ఐ విన్సెంట్ పాల్ విఆర్ఓ మహేంద్ర తదితరులు వెళ్లి కెప్టెన్ దీపికతో పాటు తల్లీ తండ్రులను వారు కలసి దీపికకు శాలువ కప్పి,పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.ఉగాది శుభాకాంక్షలు తెలిపాజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.లక్ష్మీనారాయణ, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్,,అమరాపురం సింగల్ విండో అధ్యక్షులు ఎన్.గణేష్,టిడిపి మండల కన్వీనర్ ఇ.కృష్ణమూర్తి, జయ కుమార్,,హేమావతి ఆలయ కమిటీ చైర్మన్ కె.కరేగౌడ్,మాజీ సర్పంచ్ కుమార్,స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నుంచి ఇంటి నివాస స్థలం పట్టా అందుకుంటున్న క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక

# ఉన్నతి స్త్రీ శక్తి రుణాల దరఖాస్తులు పరిశీలన

**అమరాపురం (తెలుగోడు), మార్చి 17 :**
మండలకేంద్రమైన అమరాపురంలోని హేమ మండల సమైక్య భవనం నందు మండలంలో ఇప్పటి వరకు ఉన్నతి, స్త్రీనిధి రుణాలు కోసం చేసుకున్న దరఖాస్తు జిల్లా స్థాయి అధికారులు డిపిఎం ఫైనాన్స్ వింగ్ రామిరెడ్డి, డిపిఎం ఐబీ ఎంకె సత్యనారాయణ, స్త్రీనిధి ఎజిఎం అనుమేష్, ఏపీ.ఎం. ముత్యాలప్ప తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతి,స్త్రీనిధి తదితర రుణాలను పొందిన వారు సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు.అదేవిదంగా సకాలంలో రుణాలు రికవరికి వెలుగు అధికారులు,సిబ్బంది తమ వంతు బాధ్యతగా పాటు పడాల్సిందిగా వారు పలు సూచనలు,సలహాలు నిచ్చారు.ఈ కార్యక్రమంలో హేమ మండల సమైఖ్య అధ్యక్షరాలు కోరేవు సుజాతమ్మ,వెలుగు సీ.సీ.లు గోపాలకృష్ణ, భాస్కర్,నాగరాజు వీరేష్, సిబ్బంది జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న డిపిఎం ఫైనాన్స్ డిపిఎం ఐబి. ఏ.జీ.ఎం. అధికారులు

# రాష్ట్రంలో నాలుగు రోజులు చెదురుమదురు వర్షాలు

**విశాఖపట్నం, మార్చి 17**
రాబోయే నాలుగు రోజుల పాటు రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో చెదురుమదురుగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారి జగన్నాథ కుమార్ వాతావరణ శాఖ తెలిపారు. ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. రేపటి నుంచి 20వ తేదీ వరకు వర్షాల విస్తృతి కొంత పెరిగే అవకాశముందని, ఉరుములు, మెరుపులు కూడా కొనసాగవచ్చని తెలిపారు. ముఖ్యంగా మూడవ రోజున వర్షాల తీవ్రత కొంత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇవి ప్రధానంగా సంవాహన వర్షపాతాలుగా ఉండనున్నాయని అధికారులు వివరించారు. భూమి ఉపరితలం వేడెక్కిన తర్వాత సముద్రం నుంచి వీస్తున్న గాలులు కలిసే ప్రభావంతో ఈ వర్షాలు ఏర్పడే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ వర్షాలు ఎక్కువసేపు కొనసాగకపోవచ్చని, రోజులో ఒకటి లేదా రెండు గంటలపాటు మాత్రమే కురిసే అవకాశముందని తెలిపారు. ఇక రాష్ట్రంలో ఈరోజు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే ఉండనున్నాయని, రెండో రోజు నుంచి నాలుగో రోజు వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.
కోస్తా జిల్లాల్లో ఈరోజు, రేపు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో, గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. మూడవ రోజున ఈ గాలుల వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు, గరిష్టంగా 60 కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. మత్స్యకారులకు ఎటువంటి హెచ్చరికలు జారీ చేయలేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సడలిన నిర్మాణాలు (లూజ్ స్ట్రక్చర్స్), ఎత్తైన నిర్మాణాల దగ్గర నిలబడకుండా ఉండాలని ప్రజలకు సూచించారు.


విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

# యువతతో జాతీయ సమైక్యతకు కొత్త దిశ

### అంతర రాష్ట్ర యువజన సమ్మేళనం ముగింపు

**గుంటూరు, మార్చి 17**
గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ భవన్‌లో నిర్వహించిన అంతర రాష్ట్ర యువజన మార్పిడి సమ్మేళనం (ద్వితీయ దశ) మంగళవారం ఘనంగా ముగిసింది.కేంద్ర యువజన వ్యవహారాలు,క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, మై భారత్ గుంటూరు జిల్లా నిర్వహించిన 5 రోజుల సమ్మేళనం విజయవంతంగా జరిగింది. ముగింపు సభలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర రావు మాట్లాడుతూ, దేశ ఐక్యత, సమగ్రతను బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వివిధ రాష్ట్రాల యువత పరస్పరం కలుసుకుని సంస్కృతి,సంప్రదాయాలు, విలువలను పంచుకోవడం ద్వారా దేశంలో ఐక్యత భావన మరింత బలపడుతుందని అన్నారు. త్రిపుర రాష్ట్రం నుండి వచ్చిన 37 మంది యువతి–యువకులు ఈ సమ్మేళనంలో చురుకుగా పాల్గొని, ఐదు రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, క్షేత్రస్థాయి సందర్శనలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలలో పాల్గొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని వారు తెలిపారు. మై భారత్ గుంటూరు జిల్లా ఉపసంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ, ఈ సమ్మేళనం ద్వారా రాష్ట్రాల మధ్య సాంస్కృతిక అవగాహన, స్నేహభావం పెరిగిందని, యువతలో జాతీయ చైతన్యం పెంపొందించడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఈకార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్యతేజో మూర్తి తదితరులు పాల్గొన్నారు. త్రిపుర నుంచి హాజరైన ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్స్ అందించారు.


విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

# రైతులకు అందుబాటులో టార్పలిన్ పట్టాలు

### వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఎన్. గణేష్..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 17 :**
అమరాపురం వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో టార్పలిన్ రైతులకు అందుబాటులో ఉంటాయని కావలసిన రైతులు తీసుకొని వెళ్లవచ్చని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ఎన్. గణేష్ పేర్కొన్నారు.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.





గనులు శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

## అక్రమంగాతరలిస్తున్న ఇసుక టిప్పర్ స్వాధీనం

బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 17 :
బత్తలపల్లి మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక టిప్పర్‌ను భూగర్భ గనుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్ వాహనాన్ని గుర్తించిన అధికారులు దానిని స్వాధీనం చేసుకుని బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని భూగర్భ గనుల శాఖ అధికారులు హెచ్చరించారు. ఇసుక అవసరమైన వారు ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును చెల్లించి, నిబంధనల ప్రకారం మాత్రమే పొందాలని సూచించారు.అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే భారీ జరిమానాలు విధించడమే కాకుండా వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని గనుల శాఖ టెక్నికల్ ఆఫీసర్ పి. పురుషోత్తం తెలిపారు. ప్రకృతి సంపదను అక్రమంగా కొల్లగొట్టే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

## తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు

రొళ్ల (తెలుగోడు), మార్చి 17 :
స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వేసవి దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్ చలివేంద్రం ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులు, సిబ్బంది అందరూ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.



కాలిపోయిన కేబుల్ వైర్

## కేబుల్ వైర్ అగ్నికి అహుతి

రొళ్ల (తెలుగోడు), మార్చి 17 :
మండలంలోని కొడగార్లగుట్ట గ్రామానికి ఏర్పాటు చేసిన బోర్ బావికి అమర్చిన కేబుల్ వైర్ మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని అహుతికి కాలిపోయింది. దీంతో పండుగ వేళా నీటి సమస్య ఏర్పడింది. మంగళవారం మధ్యాహ్నం ప్రాంతం లో అడవి కి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అడవి ప్రాంతానికి అనుకోని ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫర్మర్ నుంచి అమర్చిన కేబుల్ వైర్ కాలిపోవడంతో సమస్య నెలకొంది. వారానికోసారి ఈ బోర్ బావి మోటర్ పనిచేయకుండా ఏదోవిందంగా సమస్య ను సృష్టి స్తున్నారు. కేబుల్ వైర్ కట్ చేయడం, ఇతరాత్ర సమస్యలను సృష్టి నించి మోటర్ తిరగకుండా చేస్తున్నారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపి నాయకుడిని పరామర్శించిన తలారి రమేష్

ధర్మవరం (తెలుగోడు), మార్చి 17 :
ధర్మవరం పట్టణంలోని 32 వ వార్డు గిర్రాజు కాలనీకి చెందిన బిజెపి నాయకుడు చెన్నా ఆదినారాయణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్ ఆదినారాయణ ద్విచక్ర వాహనంలో వెళ్తూ ఉండగా బొలెరో వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో చెన్నా ఆదినారాయణ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న 32 వ వార్డు తెలుగుదేశం నాయకుడు తలారి రమేష్ మంగళవారం ఆదినారాయణ ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బాల నాగరాజు, దానే శ్రీరాములు, నీలూరు చలపతి, విజయ్, బాలకృష్ణ, సాకే నాగేంద్ర, సాకే నారాయణస్వామి, కప్పల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆదినారాయణను పరామర్శిస్తున్న తలారి రమేష్

# ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సుడిగాలి పర్యటన

### ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే... మండుతున్న ఎండను లెక్కచేయకుండా ద్విచక్ర వాహనంలో పర్యటన..

అగళి (తెలుగోడు), మార్చి 17 :
ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అగళి మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా మండలపరిధిలోని పరిధిలోని గాయత్రీ కాలనీ,వద్రహట్టి,పి బ్యాడిగెర, ఇరిగేపల్లి, ఎంఎంపాళ్యం, హనుమయ్యనపాలెం, ఇనగలూరు,తదితర గ్రామాలలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా ఎటువంటి ఆర్భాటం లేకుండా ఎండాకాలం కావడంతో సమస్య తలెత్తకముందే గ్రామాలలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవడానికి మండలంలోని పలు గ్రామాలకు ద్విచక్ర వాహనంలో సుడిగాలి పర్యటన చేశారు,ఈ సందర్భంగా ముఖ్యంగా ఎమ్మెల్యే తాగునీటి సమస్యపైన ప్రజలతొ మాట్లాడుతూ మీ గ్రామంలో ఏమైనా త్రాగునీటి సమస్య ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే మీ గ్రామ త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడంతో ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు రాష్ట్ర కుంచిటగ ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ. పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్,అగళి మండల నాయకులు జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి,ఎంపీపీ రేణుక కామరాజ్, వైస్ ఎంపీపీ గాయత్రి



గ్రామాల్లో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు ప్రజలు

హేమంతరాజు,సింగల్ విండో అధ్యక్షుడు కుమారస్వామి, డైరెక్టర్ శివప్ప, మండల క్లస్టర్ కోకన్వీనర్ కమ్మరి శివన్న, మాజీ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప, యోజకవర్గ కల్చరల్ సెల్ అధ్యక్షుడు రాజన్న, మాజీ ఎంపీపీలు నరసింహప్ప, మల్లేష్, మాజీ సర్పంచ్ నింగన్న, సీనియర్ నాయకులు కేవన్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు మహేష్, జీవన్, రంగనాథ్, యువ నాయకులు మంజు చరణ్,హరీష్ గౌడ్, భూతరాజు,దేవరాజు, మంజునాథ్,లైన్మెన్ నరసింహమూర్తి,తిప్పే స్వామి, పంచాయతీ అధ్యక్షుడు రెడ్డి,చిక్కన్న, గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు



ప్రజలు స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు.
గ్రామ ప్రజల మధ్యలో కూర్చుని సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

# రైతన్న మీ కోసం కార్యక్రమం

### పంచ సూత్రాలు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై పూర్తి అవగాహన .. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ..

అగళి (తెలుగోడు), మార్చి 17 :
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'రైతన్నా మీ కోసం' కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని ఇరిగేపల్లి రైతు సేవా కేంద్రం పరిధి నందరాజన పల్లి గ్రామంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నిర్వహించారు. ౖ రైతు సేవా కేంద్రాలలో నిర్దేశించిన కమిటీ సభ్యుల ద్వారా ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి ఇచ్చినటువంటి లేఖ అందించారు. నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటలు సాగు, వ్యవసాయం లో సాంకేతికత ఆహార శుద్ధి,ప్రభుత్వ మద్దతు- రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతల్లో అర్హత ఉన్న రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున కేటాయించిన నిధుల గురించి వివరించారు. ప్రభుత్వం నుంచి రైతులు లబ్ధి పొందుతున్న వివిధ రకాల పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి, ఎల్ నినో,మిడిల్ ఈస్ట్ వార్ ప్రభావం గురించి తెలియజేసి, వాతావరణ పరిస్థితులు,మారుతున్న కాలానికి అనుగుణంగా డిమాండ్ ఆధారిత పంటలను ప్రకృతి వ్యవసాయం పద్ధతులు వాడుతూ రసాయనాల వాడకాన్ని తగ్గించి వివిధ రకాల పంటలు సాగు చేయాలని ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్,పెల్లెటైజేషన్,డ్రాట్ ప్రూఫ్ మోడల్,హాఫ్ మూన్ మోడల్, ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్ లలో ఘన,ద్రవబీజామృతాలు, కషాయాలు వాడాలని, చిరుధాన్యాలు, మల్బరీ, ఉద్యానవన పంటలు, పాడి చేపట్టాలని అలాగే నూతన టెక్నాలజీలో భాగంగా ఫార్మర్ ఐడి, ఈ పంట ఫార్మర్ ఈ కేవైసి చేసి,ఏపీ ఎయిమ్స్ రైతు యాప్ ఇన్స్టాల్ చేస్తూ,కిసాన్ డ్రోన్, డ్రిప్, స్ప్రింకలర్స్ గురించి తెలిపి ఇంటింటి సర్వేలో పాల్గొన్న రైతులు వివరాలు కూడా రైతన్న మీకోసం యాప్లో అప్లోడ్ చేయడం జరుగుతుంది అని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలియజేయడం జరిగింది,ఈ కార్యక్రమం లో జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, సీనియర్ నాయకులు జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, ఎంపీపీ రేణుక కామరాజ్, వైస్ ఎంపీపీ గాయత్రి హేమంత్ రాజు, మాజీ సర్పంచ్ నింగన్న, మాజీ ఎంపీపీ మల్లేష్, సింగల్ విండో అధ్యక్షులు కుమారస్వామి, యువ నాయకులు హరీష్ గౌడ్, మంజు చరణ్, హనుమంత రాయుడు, పాల్గొన్నారు ప్రభుత్వం అందజేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు, రైతులు,అధికారులు పాల్గొన్నారు.



రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

# రఘువంశీ మృతితో కుటుంబంలో విషాదం

### బీఎస్ఎఫ్ మాజీ జవాన్ కుటుంబానికి పరామర్శ.. ప్రభుత్వం అండగా ఉంటుంది.. మంత్రి సత్యకుమార్ యాదవ్..

బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 17 :
రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువకుడు రఘువంశీ కుటుంబాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మంగళవారం పరామర్శించారు. బత్తలపల్లి మండలంలోని ఈదుల ముస్టూరు గ్రామానికి చేరుకున్న మంత్రి బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.గత నెలలో బెంగళూరులోని అలియన్స్ యూనివర్సిటీ లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రఘువంశీ (21) కళాశాల నుంచి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వేగంగా వచ్చిన టిప్పర్ వాహనం ఢీకొనడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ సేవలో పనిచేసిన బీఎస్ఎఫ్ మాజీ జవాన్ కుటుంబానికి ఇలాంటి విషాదం సంభవించడం ఎంతో బాధాకరమని, కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అవసరమైన సహాయం అందించేందుకు అధికారులకు ఇప్పటికే సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని వ్యక్తం చేస్తున్నారు.మంత్రి గ్రామ సందర్శన సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.



బిఎస్ఎఫ్ మాజీ జవాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

# తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

### ఎమ్మెల్యే ఎంఎస్ రాజు..

అగళి (తెలుగోడు), మార్చి 17 :
తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయంగా మండలంలో నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇనగలూరు గ్రామంలో ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు పర్యటించారు. పలు గ్రామాలలో స్వయంగా వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులతో అక్కడికి అక్కడే మాట్లాడి పలు సమస్యలకు తక్షణ పరిష్కారం చూపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, దేవాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం వంటి సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేసారు. వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా గ్రామాల్లో పశువులు దాహర్తి కోసం నిర్మించిన నీటి తొట్టెలను ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే వెంట మండల నాయకులు అధికారులు ఎంపీడీవో గంగాధర్, పరిపాలనాధికారి రాజేంద్ర ప్రసాద్,డ్యూటీ ఎంపీడీవోలు రెడ్డి ప్రకాష్, ఆర్ డబ్ల్యూ ఎస్ డి ఈ మనూ నాయక్, పంచాయతీ కార్యదర్శులు రంగనాథ్, మహేష్,సురేష్,జీవన్,రాజు నాయక్,తదితరులు వున్నారు



నీటి తొట్టెలను ప్రారంభిస్తున్న ఎంఎల్ ఏ ఎంఎస్ రాజు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

## అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

### ఎమ్మెల్యే ఎంఎస్ రాజు.,

అమరాపురం (తెలుగోడు), మార్చి 17 :
అమరాపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వసతి గృహం, మరియు మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన మరియు మధ్యాహ్న భోజన నాణ్యత పై విద్యార్థినీలతో నేరుగా అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం, విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల సమస్యలను త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు

## అభివృద్ధికి కొత్త దిశ

### జమాత్ ఆధ్వర్యంలో జామియా మస్జిద్ నూతన కమిటీ .. ముతవల్లిగా కుటాగుళ్ళ హైదర్ వలి..

ముదిగుబ్బ (తెలుగోడు), మార్చి 17 :
ముదిగుబ్బ పట్టణంలోని జామియా మస్జిద్ అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. మంగళవారం జమాత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మస్జిద్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ప్రధాన లక్ష్యాలుగా కమిటీ ముందుకు సాగనుంది. ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్/ముతవల్లిగా కుటాగుళ్ళ హైదర్ వలి బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా సయ్యద్ బాబాసాబ్, నిసార్ అహమ్మద్, రెడ్డెప్ప, మటన్ అయూబ్, మౌలా బాషా, చికెన్ మౌలా, ముస్తఫా, హైదర్, టైలర్ ముస్తఫా, దస్తగీర్, బాదర్ వలి, జిలేబీ మహబాబ్ పీరా, సొదక్ అలీలు ఎన్నికయ్యారు. మూడేళ్ల పదవీకాలంతో బాధ్యతలు చేపట్టిన ఈ కమిటీ, మస్జిద్ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించనుంది. ముఖ్యంగా మస్జిద్ శుభ్రత, ప్రార్థనలకు వచ్చే భక్తులకు సౌకర్యాల విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల, ధార్మిక కార్యక్రమాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు అధ్యక్షుడు హైదర్ వలి తెలిపారు. అదేవిధంగా సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపట్టడం, యువతను ధార్మిక కార్యక్రమాల వైపు ఆకర్షించడం, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను కూడా కమిటీ ప్రాధాన్యంగా తీసుకుంటుందని సభ్యులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగినట్లు నిర్వాహకులు తెలిపారు. జమాత్ పెద్దలు, స్థానికులు కొత్త కమిటీకి అభినందనలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో జామియా మస్జిద్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరై, నూతన కమిటీకి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

## వేసవి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్..

బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 17 :
ఎండలు రోజురోజుకూ తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ సూచించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం వల్ల డీహైడ్రేషన్, వడదెబ్బ, జీర్ణకోశ సమస్యలు, చర్మవ్యాధులు వంటి సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశముందని తెలిపారు.వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గిపోతే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కలుషిత ఆహారం, నీటి వల్ల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే శరీరంలో నీరు తగ్గిపోతే కిడ్నీలో రాళ్లు, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశముందని తెలిపారు.ప్రతి వ్యక్తి రోజుకు కనీసం మూడు నుండి నాలుగు లీటర్ల నీరు తాగడం తప్పనిసరి అని సూచించారు. ఎండలో ఎక్కువసేపు తిరగకపోయినా నీరు తక్కువగా తాగితే డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తుతాయని వివరించారు.కాలుష్యం, ధూళి ఎక్కువగా ఉండటం వల్ల ఆస్తమా,ఇతర శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు.వేసవిలో అధికంగా చెమటపడటం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావచ్చని, అలాగే కిరణాల ప్రభావంతో సన్‌బర్న్ సమస్యలు ఏర్పడే అవకాశముందని చెప్పారు.రోడ్డు పక్కన నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినకూడదని ఆయన హెచ్చరించారు. కాకర, దోసకాయ, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి చల్లదనాన్ని ఇచ్చే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అలాగే కాంచిన లేదా ఫిల్టర్ చేసిన నీటినే తాగాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వేసవికాలంలో ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించడం అవసరమని డాక్టర్ అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

### పశువైద్య సహాయ సంచాలకులు శ్రీనివాసులు.. వైద్యాధికారి గుర్నాథ్ రెడ్డి..

బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 17 :
పశువులకు ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి సోకకుండా రైతులు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలని పశు వైద్య సహాయ సంచాలకులు శ్రీనివాసులు, వైద్యాధికారి గుర్నాథ్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ పథకం కింద మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది నేరుగా రైతుల ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో తీవ్రమైన జ్వరం, నోటి పూత, కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయని వివరించారు. దీనివల్ల పశువులు మేత మేయలేక, నడవలేక తీవ్రంగా నిరసించిపోతాయని, ఫలితంగా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇది రైతులకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుందని, అందుకే టీకాల ద్వారా ముందస్తు రక్షణ కల్పించుకోవాలని కోరారు.?అదేవిధంగా, వేసవిలో పశుగ్రాస కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీతో సిఎస్ హెచ్ -24,ఎంఎఫ్ రకం గడ్డి విత్తనాలను అందిస్తోందని తెలిపారు. నీటి వసతి ఉన్న రైతులు ఈ విత్తనాలను సాగు చేసుకుంటే 60 రోజుల్లోనే తొలి కోత వస్తుందని, పచ్చిమేపు అందించడం ద్వారా వేసవిలో కూడా అధిక పాల దిగుబడిని పొందవచ్చని పేర్కొన్నారు. పశువైద్య సిబ్బంది గ్రామాలకు వచ్చినప్పుడు రైతులందరూ సహకరించి, తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు.



గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్య సహాయ సంచాలకులు శ్రీనివాసులు



తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

# కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో సీట్లు పెంచాలి

**విద్యార్థుల వలసలు నివారించాలి ..**
**తహసీల్దార్‌కి వినతి పత్రం.. విద్యార్థి సంఘాల నాయకులు..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 17 :**

జిల్లాలోని కేజీబీవీ కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో సీట్లు పెంచాలని ఎమ్మిగనూరు తహసీల్దార్ శ్రీనివాసులుకు విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆర్ఎవిఫ్ నాయకులు ఖాజా కృష్ణ, పిఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు రఘునాథ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఉన్న కేజీబీవీ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికి సీట్లు ఇవ్వాలన్నారు. అదేవిధంగా కర్నూలు ప్రాంతం వలసలు ప్రాంతం తల్లిదండ్రు వలసలకు వెళ్లి వారి జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటారన్నారు. వలసలకు వెళ్లే సమయంలో విద్యార్థులను ఎక్కడ వదిలి వెళ్లాలో తెలియక విద్యార్థులను తల్లిదండ్రులు వెంట తీసుకువెళ్తున్నారన్నారు. కర్నూలు అక్షరాస్యతలో రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడినటువంటి ప్రాంతమని, ఈ ప్రాంతంలో బాల్య వివాహాలు నిరక్షరాస్యత నెలకొంటోందన్నారు. ఈ ప్రాంత ప్రజలు వలసలకు వెళ్లడం వలన అరకొర చదువులత విద్యార్థుల జీవితాలు మసిబారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కస్తూర్బా పాఠశాలల్లో దరఖాస్తు ప్రతి విద్యార్థినికి సీటు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో మరిన్ని ఉద్యమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వీరేష్ ఉరుకుంద తదితర నాయకులు పాల్గొన్నారు.



ట్యాంకర్లతో మంచినీరు పరఫరా చేస్తున్న దృశ్యం

# తాగునీటి సమస్యకు తాత్కాలిక ఉపశమనం

**బుట్టా ఫౌండేషన్ చొరవతో బి. అగ్రహారంలో ట్యాంకర్లతో నీటి సరఫరా..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 17 :**

గోనెగండ్ల మండల పరిధిలోని బి. అగ్రహారం గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. గ్రామ పంచాయతీ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామ ప్రజల రోజువారీ అవసరాలకు కూడా సరిపడా నీరు అందకపోవడంతో పరిస్థితి మరింత విషమించింది. సమస్యను గమనించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ అగ్రహారం రంగారెడ్డి వెంటనే స్పందించి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త , మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజల ఇబ్బందులను పూర్తిగా వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.విషయంపై సానుకూలంగా స్పందించిన పరిస్థితి ని అత్యవసరతను గుర్తించి, తన భర్త, బుట్టా ఫౌండేషన్ అధినేత మరియు పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన, వెంటనే చర్యలు చేపట్టి బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా గ్రామ ప్రజలకు తక్షణమే స్వచ్ఛమైన మంచినీటిని అందించడంతో, కొంతవరకు నీటి సమస్యకు ఉపశమనం కలిగింది. నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా నిలిచింది. సేవా కార్యక్రమం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే స్పందించిన గారు, అలాగే గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారు కోరుకున్నారు. సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి తక్షణ స్పందనతో సహాయం అందించడం నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు.



ట్యాంకర్లతో మంచినీరు పరఫరా చేస్తున్న దృశ్యం

# వేరుశెనగ నూర్పిడి యంత్రంలో పడి వ్యక్తి దుర్మరణం

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 17 :**

పెద్దకడబూరు మండల పరిధిలోని నౌలేకల్ గ్రామ శివారులో మంగళవారం జరిగిన దుర్ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దొడ్డనగేరి గ్రామానికి చెందిన తలారి వీరేంద్ర (32) వేరుశనగ నూర్పిడి యంత్రంలో చిక్కుకుని దుర్మరణం చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నౌలేకల్ గ్రామానికి చెందిన పుష్పరాజు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న బోయ చిన్నస్వామి వేరుశనగ పంటను నూర్పిడి చేయడానికి యంత్రాన్ని ఉపయోగిస్తున్నాడు. ఈ పనికి కూలీగా వెళ్లిన తలారి వీరేంద్ర వేరుశనగ కట్టెలను మిషన్‌లో వేస్తుండగా అతని చేతికి కట్టుకున్న తువాలు యంత్రంలో ఇరుక్కుంది. ఒక్కసారిగా మిషన్ అతనిని లోపలికి లాగడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన తోటి కూలీలు వెంటనే స్పందించి తీవ్ర రక్తస్రావంతో ఉన్న వీరేంద్రను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య పల్లవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువకుడి ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తలారి వీరేంద్ర మృతితో దొడ్డిమేకల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



వేరుశనగ నూర్పిడి యంత్రంలో పడి మృతి చెందిన తలారి వీరేంద్ర
ప్రమాదానికి కారణమైన వేరుశనగ నూర్పిడి యంత్రం

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**పీఎం కిసాన్--అన్నదాత సుఖీభవతో ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 17 :**

రైతుల ఆర్థిక స్థిరత్వం, సాగు ఖర్చుల భారం తగ్గింపు లక్ష్యంగా పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, సొసైటీ చైర్మన్ కందనాతి నరసప్ప, టీడీపీ సీనియర్ నాయకులు వీరేష్ గౌడ్, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్కన్న స్పష్టం చేశారు. మంగళవారం పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం, జాలవాడి గ్రామాలలో రైతన్న కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతన్నకు ప్రత్యక్ష నగదు సాయం అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా రైతులను కలుసుకుని పథకం అమలు విధానం, అర్హతలు, అందుతున్న లబ్ధులను వివరించారు. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతులకు ఈ పథకం ద్వారా లభిస్తున్న ఆర్థిక సహాయం సాగుకు ఎంతో దోహదపడుతోందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని మూడు విడతలుగా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. విత్తనాలు, ఎరువులు, కార్మిక వ్యయాలు వంటి అవసరాలకు ఈ సాయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే రైతులు పథకానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే అధికారులను సంప్రదించాలని, ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని హామీ ఇచ్చారు. వ్యవసాయం లాభదాయకంగా మారేలా ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి అర్హుడైన రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు చాకలి నారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షులు నరసింహులు, టీడీపీ నాయకులు మాల శివ, చాకలి చంద్రశేఖర్, ఏక్ హనుమంతు, జాలవాడి గ్రామ నాయకులు రాముడు, వీరేష్, తాయన్న, భీమన్న, రంగన్న, వీఏఏ పావని, రైతులు పాల్గొన్నారు.



పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకంపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు





జాలవాడిలో రైతన్న కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ముక్కన్న
చిన్నతుంబళం సొసైటీ ఆవరణలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# ప్రకృతి వ్యవసాయంతోనే ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం

**ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి..**

**కోసిగి (తెలుగోడు), మార్చి 17 :**

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని మంత్రాలయం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు.. కోసిగి మండల వ్యవసాయ అధికారి ఎం వరప్రసాద్ ఆధ్వర్యంలోమంగళవారం నాడు కడిదొడ్డి గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి ముఖ్యాతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పెంపొందించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని దీనికోసం రైతులందరూ నడుం బిగించాలని తెలిపారు. విత్తన గుళికలు తయారు చేసుకునే విధానం పై ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రదర్శన క్షేత్రంలో కషాయాలు తయారు చేసుకునే పద్ధతి, విత్తన గుళికలు తయారు చేసుకునే పద్ధతిని వారు అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి యం.వరప్రసాద్, మండల కోఆర్డినేటర్ రాజాం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా కోసిగి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయటం వలన రైతులు మంచి ఆదాయాన్ని పొందొచ్చని, అలాగే వ్యవసాయంలో సాంకేతికతను జోడించినప్పుడే వ్యవసాయం లాభదాయకమవుతుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ పథకాల పై రైతులకు అవగాహన కల్పించేందుకు రైతుల గృహాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కోసిగి మండలం కన్వీనర్ పల్లెపాడు రామిరెడ్డి,, ఆర్ల బండ సొసైటీ ప్రెసిడెంట్ యన్. అయ్యన్న, టిడిపి సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రామకృష్ణ, మండల తాసిల్దార్ వేణుగోపాల్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ కే రాజు, యస్. ఐ. రమేష్ రెడ్డి, ఏ వీరేష్, జ్ఞానేష్ పాల్గొన్నారు.



కడదొడ్డిలో జరిగిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి

# జాలవాడిలో ఉపాధి పనులు ప్రారంభం

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 17 :**

పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ శాంతప్ప ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను టీడీపీ గ్రామ అధ్యక్షులు బోయ యంకన్న, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బజారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ కూలీల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని ప్రతి కూలీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోనే ఉపాధి అవకాశాలు లభిస్తున్న ఈ సమయంలో ఎవరూ వలసలు వెళ్లకుండా స్థానికంగా పనులు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనులు గ్రామ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే కాకుండా కుటుంబాల జీవనోపాధికి బలంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భీమన్న, కాశీం, బుల్లప్ప, రోగన్న, దేవసహాయం, జనసేన పార్టీ నాయకులు హుసేని పాల్గొన్నారు. గ్రామంలోని కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పనుల ప్రారంభాన్ని స్వాగతించారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.



జాలవాడి గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

# చిన్నతుంబళంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**గ్రామస్తుల నుంచి విశేష స్పందన..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 17 :**

పెద్దకడబూరు మండల పరిధిలో చిన్నతుంబళం గ్రామంలోని సొసైటీ ఆవరణలో మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని విజయన్ ఆసుపత్రి వారి సౌజన్యంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, సొసైటీ చైర్మన్ కందనాతి నరసప్ప, సీఈఓ నరసింహమూర్తి, టీడీపీ గ్రామ అధ్యక్షులు నరసింహులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విజయన్ ఆసుపత్రి వైద్యులు అనూష రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పూజారి ఈరన్న, సాగునీటి సంఘం అధ్యక్షులు నారాయణ, టీడీపీ నాయకులు ఏక్ హనుమంతు, కురువ నాగరాజు, సుకూర్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి

# నూతన వాహనం ప్రారంభం

**ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి ..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 17 :**

ఎమ్మిగనూరు పట్టణంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద డిక్కీ కోఆర్డినేటర్ పల్లవి దిలీప్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద నాగరాజు ఎస్సీ,ఎస్టీ అభివృద్ధి కొరకు ప్రభుత్వం అందించే సబ్సిడీలోన్ కింద వాణిజ్య వాహనాన్ని మంజూరు చేయించగా దానిని ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందరి ప్రభుత్వం అని అన్ని కులాలను సమానంగా చూసే పార్టీ ఏదైనా ఉందంటే అది తమ కూటమి ప్రభుత్వమేనని తప్పకుండా ఆ ఘనత తమ ప్రభుత్వానికే చెందుతుందని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ అందరితోపాటు సమానంగా ఎదగాలని అన్ని సమాన అవకాశాలు వారు కూడా అందిపుచ్చుకోవాలని వారికి ప్రభుత్వం తరఫున ఎదగడానికి లోన్ ద్వారా వెహికల్స్‌ను అందించి తద్వారా వారు సొంత కాళ్లపై నిలబడాలని వారి ఆత్మ గౌరవాన్ని పెంపొందించాలని కూటమి ప్రభుత్వం వారి వైపున నిలబడిందని అన్నారు. ఇవేకాక ఆడవాళ్లకు ఉచిత బస్సు ప్రయాణం, పిల్లలకు అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్మెంట్, వృద్ధులకు వికలాంగులకు అత్యధిక పెన్షన్, ప్రతి ఒక్కరికి తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించి ప్రతి ఒక్కరి అభివృద్ధిని కోరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్ షాలెం టిడిపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

# రంజాన్ సందర్భంగా నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 17 :**

పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా, దివంగత మాజీ ఎమ్మిగనూరు మునిసిపల్ వైస్ చైర్మన్ మాజీ డి. బసీర్ అహమ్మద్‌ని స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులు ఎంతో భక్తిశ్రద్ధలతో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన సతీమణి హాజీమా సలీమా బీ , ఆయన తనయుడు మునిసిపల్ వైస్ చైర్మన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ంయువజన విభాగం అధ్యక్షులు డి. నజీర్ అహమ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రంజాన్ మాసం అనేది కేవలం ఉపవాసాల కాలం మాత్రమే కాకుండా, దానం (సదఖా), జకాత్, దయ, కరుణ, సహనానికి ప్రతీకగా భావించబడుతుంది. ఈ పవిత్ర కాలంలో పేదలకు సహాయం చేయడం ఇస్లాం ధర్మంలో అత్యంత పుణ్యకార్యంగా భావించబడుతుంది. అదే ఆధ్యాత్మిక భావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. ఈ సేవా కార్యక్రమం ద్వారా సమాజంలో సహోదర భావం, పరస్పర ప్రేమ, మానవతా విలువలు ప్రతిఫలించాయి. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు కుటుంబ సభ్యుల సేవా తపనను ప్రశంసిస్తూ, వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సందర్భంగా డి.నజీర్ అహమ్మద్ మాట్లాడుతూ "అల్లాహ్ కరుణతో మనకు లభించినదాన్ని అవసరంలో ఉన్న వారితో పంచుకోవడం ప్రతి ముస్లింల బాధ్యత. రంజాన్ మాసం మనకు ఆత్మశుద్ధి, సేవాభావం నేర్పుతుంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తాము" అని తెలిపారు.



నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

# ఉగాది పురస్కారం 2026కు గద్వాల సోమన్న ఎంపిక

**గణిత ఉపాధ్యాయుడికి రాష్ట్ర స్థాయి గౌరవం ..**

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 17 :**

నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న బాలబంధు గద్వాల సోమన్న రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం - 2026కు ఎంపికయ్యారు. ఈ నెల 19వ తేదీన ఉగాది సందర్భంగా



విజయవాడలోని తుమ్మల కళా క్షేత్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. బహు గ్రంథకర్తగా, విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న గద్వాల సోమన్న ఈ గౌరవానికి ఎంపిక కావడం స్థానికంగా ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అద్దేపల్లి జాన్సన్, తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు ఆయనను అభినందించారు. విద్యార్థులకు గణితాన్ని సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ, విద్యా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన సోమన్నకు ఈ అవార్డు రావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



తహసిల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మమ్మ

## సుండుపల్లె తహసిల్దారుగా లక్ష్మమ్మ బాధ్యతల స్వీకరణ

**టి.సుండుపల్లి (తెలుగోడు), మార్చి 17 :**
సుండుపల్లి తహసీల్దారుగా లక్ష్మమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వల్లూరులో డిప్యూటీ తాసిల్దారుగా పనిచేసే పదోన్నతిపై సుండుపల్లి తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించడంతో కార్యాలయ సిబ్బంది వీఆర్వోలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ప్రజలు రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని ఆమె తెలియజేశారు. సుండుపల్లెలో తహసిల్దారుగా పనిచేసిన మహబూబ్ చాంద్ కడపకు బదిలీ అయ్యారు.



మృతి చెందిన ఫోటోగ్రాఫర్ రఘు

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**గూడూరు (తెలుగోడు), మార్చి 17 :**
గూడూరు పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం సమీపంలో ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఎస్ఆర్ ల్యాబ్‌లో పనిచేస్తున్న రఘు (35) అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన గూడూరు రూరల్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



గాయపడిన మరో వ్యక్తి

## అమరావతి గుత్తేదారులకు సులభరీతిన కంకర, ఇసుక, మట్టి

**అమరావతి, మార్చి 17 :**
అమరావతి పనుల పురోగతిలో అంతర్భాగమైన కంకర , ఇసుక, మట్టి వంటివి గుత్తేదారులకు సులభరీతిన లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని భూగర్భ వనరులు, గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి , తిరుపతి ఆర్థిక మండలి సిఇఓ ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు అదేశాల మేరకు అన్ని రకాల మైనింగ్ అనుమతుల విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, నిబంధనల సరళీకరణను కూడా చేపట్టామన్నారు. సిఆర్డిఎతో కలిసి అమరావతి నిర్మాణ పనులకు సంబంధించి ప్రధాన గుత్తేదారులుగా ఉన్న ఎల్ అండ్ టి, మేఘా, ఎన్ సిసి, బిఎస్ సిపిఎల్, ఆర్ విఆర్ సంస్థల ప్రతినిధులతో మీనా మంగళవారం సచివాలయం వేదికగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ గుత్తేదారుల ఆకాంక్షల మేరకు సాధ్యమైనంత తక్కువ దూరంలోనే ఈ వనరులు లభించేలా చర్యలు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో ఇంకా ఎంతమేర గ్రావెల్ , మట్టి, ఇసుక వంటివి అవసరం అవుతాయన్న దానిపై అంచనాలు సమర్పిస్తే తదనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేస్తామని వివరించారు. కృష్ణా జిల్లాలో అటవీ అనుమతుల పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుత్తేదార్లు మీనా దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ బాలాజీ నుండి వివరాలు తీసుకున్నారు. ఎట్టి పరిస్థితులలోనూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపవలసిందేనని అన్నారు.



## నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌కు విద్యార్థి ప్రణీత్ ఎంపిక

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 17 :**
మండల పరిధిలోని గోరివిమాకులపల్లి పంచాయతీ గడ్డురు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు ప్రణీత్ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం నారాయణ తెలిపారు. విద్యార్థికి 8వ తరగతి నుండి ఇంటర్ రెండవ సంవత్సరం వరకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు చొప్పున కేంద్ర ప్రభుత్వం విద్యార్థి చదువు కోసం బ్యాంకు ఖాతాలో వేస్తారన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థిని విద్యార్థులు మంచి చదువు అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ లు మల్లికార్జున, నారాయణ ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

# పల్లె గొంతు ఎండిపోతోంది..

### గుక్కెడు నీటి కోసం మాతమ్మ హరిజనవాడవాసుల కష్టాలు .. గత 15 రోజులుగా నీటి కష్టాలు.. సమస్యపై స్పందించని అధికారులు..

**టి.సుండుపల్లి (తెలుగోడు), మార్చి 17 :**
మా గొంతు ఎండిపోతోంది గుక్కెడు మంచినీళ్లు ఇప్పించండి మహాప్రభో అని మాతమ్మ హరిజనవాడ గ్రామస్థులు దీనంగా కోరుతున్నారు. కడప జిల్లా సుండుపల్లి మండల పరిధిలోని మడితాడు పంచాయతీ కొలిమిమిట్ట



పనిచేయని బోరు



దిష్టిబొమ్మలా మిగిలిన ట్యాంకు

మాతమ్మ హరిజనవాడలో గత 15 రోజులుగా తాగునీరు లేక విలవిలలాడుతున్నామని, కరెంటు ఉన్నప్పుడే పొలాల దగ్గర తాగునీటి కోసం గ్రామస్తులు పడికాపులు కాస్తూ పనులను సైతం వదిలేసి తాగేందుకు గుక్కెడు మంచినీరు పట్టుకునేందుకు వేచి ఉండాల్సిన దుర్భర పరిస్థితిలో తాము ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 15 రోజులుగా తాగునీటి బోరు మోటర్,స్టార్టర్ చెడిపోయి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిసినా ప్రజాప్రతినిధులు అధికారులు తలెత్తు కూడా చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ పరిస్థితి ఇలా ఉంటే గ్రామంలో పశువుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏఈ ఇర్ఫాన్ అహ్మద్ వివరణ..**
తాగునీటి సమస్య గురించి తెలిసిందని గ్రామీణ నీటి సరఫరా ఏఈ ఇర్ఫాన్ అహ్మద్ తెలిపారు. మోటారు, స్టాటరుకు మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

### బోరు చెడిపోయి 15 రోజులు అయింది..

**- మల్లప్ప, మాతమ్మ హరిజనవాడ.**



మా పల్లెలో బోరు చెడిపోయి 15 రోజులు అయింది. కనీసం తాగడానికి కూడా నీళ్లు లేని స్థితిలో మేమున్నాం. అధికారులు నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరును మరమ్మత్తు చేయించాలి.

### నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు

**- సుబ్బమ్మ, మాతమ్మ హరిజన వాడ**



నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నిత్యావసరాలకు కూడా తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం . నీళ్లు ఇచ్చి అధికారులు ఆదుకోవాలి.

## 15 కుటుంబాలు టిడిపిలో చేరిక

**ముద్దనూరు (తెలుగోడు), మార్చి 17 :**
స్థానిక ఎస్వీ గిరి కాలనీలోని 15 కుటుంబాలు వైఎస్ఆర్సిపి నుండి కుటుంబాలు జిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిలో అలవలపాడు నరసింహులు, కత్తి,రమణయ్య, తదితర కుటుంబాలతోపాటు మరికొన్ని కుటుంబాలు టిడిపి లో చేరాయి. ఈ తరహాలో కూటమి ప్రభుత్వంలోని టిడిపికి మరింత బలం చేకూరే విధంగా సన్నాహాలు జరుగుతున్నాయని ప్రజలు అనుకుంటున్నారు.



టిడిపిలో చేరిన వైకాపా నాయకులు





కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

# విజయవంతంగా సూపర్ సిక్స్ హామీలు అమలు

### అన్నారెడ్డిపాలెంలో రైతన్నా మీకోసం.. మీ భూమి మీ హక్కు కార్యక్రమం.. రూ.1.68 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. ప్రారంభోత్సవాలు.. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి..

**సంగం, (తెలుగోడు), మార్చి 17 :**
తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ, ప్రతి కుటుంబానికి తోడుగా ఉంటుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సంగం మండలం అన్నారెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన మీ భూమి మీ హక్కు, రైతన్నా మీకోసం కార్యక్రమాల్లో మంత్రి ఆనం పాల్గొని, రైతులకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ పాస్ పుస్తకాల ద్వారా భూమి యజమానుల పూర్తి వివరాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని, రైతుల భూ హక్కులకు చట్టబద్ధ రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. గతంలో వలె ముఖ్యమంత్రి ఫోటోలు కాకుండా ప్రభుత్వ రాజముద్రతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన పాసుపుస్తకానికి తమ ప్రభుత్వం రాజముద్రతో పాటు లబ్ధిదారుని ఫొటో, క్యూఆర్ కోడ్, సెక్యూరిటీ లైన్ వంటి భద్రతాపరమైన అంశాలతో ముద్రించిన పాసుపుస్తకానికి వున్న తేడాను మంత్రి రైతులకు అర్థమయ్యేలా వివరించారు. తమ ప్రభుత్వం ఇస్తున్న పాసుపుస్తకాలు రిజర్వు బ్యాంకు ముద్రించిన కరెన్సీ నోట్ల వలె చట్టభద్రత కలిగినవన్నారు.

**ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నాం..**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని తెలిపారు. రైతులకు చెప్పినవిధంగా ఏడాదికి రూ.20వేలు అందించామని మంత్రి ఆనం చెప్పారు. జిల్లాలో 404 రైతుసేవా కేంద్రాల పరిధిలో 161 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 4150 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు ప్రభుత్వానికి విక్రయించగా, 24 నుంచి 48 గంటల్లోనే వారి ఖాతాలకు రికార్డుస్థాయిలో జమ చేశామన్నారు. ఇది రైతులకు ప్రతి విషయంలోనూ అండగా నిలిచే ప్రభుత్వమని పునరుద్ఘాటించారు.

తల్లికి వందనం పథకం ద్వారా పిల్లల సంఖ్యకు అనుగుణంగా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతినెలా కోట్లాది రూపాయల పింఛన్లను క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అన్నా క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజనం అందిస్తుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ప్రభుత్వమే నిధులు భరిస్తోందని పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా గ్రామస్థాయిలో వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

వివరించారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**సంక్షేమంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి..**
అన్నారెడ్డిపాలెం గ్రామంలో రూ.168 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. పండుగ వాతావరణంలో కోట్లాది రూపాయల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో రూ.36 లక్షలతో గ్రామ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.69 లక్షలతో తాగునీటి పథకం పనులకు ప్రారంభం పలికారు. పల్లిపాలెంకు రూ.31 లక్షలతో అంతర్గత పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. పల్లిపాలెం వినాయక స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలతో భూమిపూజ నిర్వహించారు. రూ.8.5 లక్షలతో నిర్మించిన కల్వర్ట్‌ను ప్రారంభించారు. గ్రామ సచివాలయం వద్ద రూ.9 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించగా, అరుంధతివాడలో మరో రూ.9 లక్షల సీసీ రోడ్డుకు కూడా ప్రారంభోత్సవం చేశారు. అలాగే గ్రామస్థుల కోరిక మేరకు మెయిన్ బ్రిడ్జి నిర్మాణం, రోడ్ల నిర్మాణం ఇతర అభివృద్ధి పనులకు మంత్రి హామీ ఇచ్చారు.

**రాష్ట్రవ్యాప్తంగా శోభాయమానంగా ఉగాది వేడుకలు..**
ఈనెల 19 తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని రాష్ట్రవ్యాప్తంగా అత్యంత శోభాయమానంగా నిర్వహించేందుకు అన్ని ఆలయాల్లో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి ఆనం చెప్పారు. ప్రతి ఆలయం కూడా భక్తులతో కళకళలాడేలా ఆధ్యాత్మిక శోభతో తెలుగు సంవత్సరాదిని ఆహ్వానించేలా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కోట్లాది రూపాయలతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని, శ్రీవాణి ట్రస్టు నిధులతో 5వేలకు పైగా ఆలయాలను రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. భక్తులందరూ ఆధ్యాత్మిక భావనతో భగవత్ సాన్నిధ్యంలో ఆనందంగా గడిపేలా ఆలయాలను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎడిఎ అనిత, స్థానిక ప్రజా ప్రతినిధులు, మెట్టుకురు విజయ్ కృష్ణారెడ్డి. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ..**

**సంగం, (తెలుగోడు), మార్చి 17 :**
పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ, వారికి అన్నివిధాల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం సంగం మండలం అన్నారెడ్డిపాలెంలో 12మంది లబ్ధిదారులకు రూ. 4.91 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను మంత్రి అందజేశారు. అలాగే పార్టీ సభ్యత్వం తీసుకుని ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ 5 లక్షలు బీమా మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఆనం

## మంత్రి ఆనం పర్యటన విజయవంతం

**సంగం, (తెలుగోడు), మార్చి 17 :**
సంగం మండలం అన్నారెడ్డిపాలెంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పర్యటన విజయవంతమైంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులు మెట్టుపూరు విజయ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నారెడ్డిపాలెం గ్రామస్థులు, స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో 1.68 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు మంత్రి ఆనం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రభుత్వ రాజముద్రతో నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అన్నారెడ్డి పాలెం గ్రామంలో రూ.36 లక్షలతో గ్రామ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జల జీవన్ మిషన్ (జీజీవీ) కింద రూ.69 లక్షలతో తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన చేశారు. పల్లిపాలెంకు రూ.31 లక్షలతో అంతర్గత పైపులైన్లతో తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన చేశారు. పల్లిపాలెం వినాయక స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలతో భూమిపూజ చేశారు. రూ.8.5 లక్షలతో కల్వర్ట్ ప్రారంభోత్సవం చేశారు. రూ.9 లక్షలతో సచివాలయం సీసీ రోడ్డు, అరుంధతివాడలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.



సచివాలయంలో తనిఖీలు చేస్తున్న కడ పిడి వికాస్ మర్మత్

## సచివాలయం తనిఖీ

**కడ పిడి వికాస్ మర్మత్ ..**

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 17 :**
మండల కేంద్రంలోని సచివాలయాన్ని కుప్పం కడ పిడి వికాస్ మర్మత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పది పరీక్ష కేంద్రాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించి ప్రజలతో సఖ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం మీద ప్రజల నుంచి మంచి అభిప్రాయం, స్పందన వచ్చేలా చూడాలన్నారు. మండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి నాయకులు, అధికారులకు సమన్వయంతో పని చేయాలన్నారు. మండల కేంద్రంలో టాయిలెట్లు నిర్మించాలని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో మురళీధర్ రెడ్డి ,టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, కడ సభ్యుడు రఘు, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ సీతాపతి, నేతలు గుర్రప్ప, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యత , బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు అవగాహన

**రామకుప్పం (తెలుగోడు), మార్చి 17 :**
మండల పరిధిలోని ఉన్సిగానిపల్లి పంచాయతీలో వి. కోట భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్వారా ప్రజలకు అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రిజర్వ్ బ్యాంక్ యొక్క సేవలు ఆర్థిక వ్యవహారాలపై అవగాహన బ్యాంకు ఖాతాలు వాటి ఉపయోగాలు ఆర్డి, ఎఫ్ డి, పీపీఎఫ్ అకౌంట్ గురించి అవగాహన కల్పించారు. పొదుపులు చేయడం వల్ల పొదుపు ఆవశ్యకత, నగదురహిత లావాదేవీలు, బ్యాంకు భీమా పథకాలు, అటల్ పెన్షన్ పథకం, సుకన్య సమృద్ధి యోజన పథకం, పోస్ట్ ఆఫీస్ లోను బ్యాంకు సేవలను ఏ విధంగా చేసుకోవాలో వివరించారు. ప్రమాదవశాత్తు మరణించడం వల్ల సురక్ష బీమా యోజన కలుగు లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సులోచన గుర్రప్ప, నేతలు శంకరాచలం, కృష్ణారెడ్డి, మనేష్, బ్యాంకు సిబ్బంది మహేష్ చంద్రయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలకు బ్యాంకులపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

# బాపులదొడ్డిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు



పేదలకు పట్టాల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి

## పేదలకు పట్టాల పంపిణీ

**ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 17 :**
ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రహరీ పక్కన నివసిస్తున్న కుటుంబాలకు ఇంటి పట్టా స్థలం పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. మున్సిపాలిటీ స్థలంలో నివసిస్తున్న ఈ కుటుంబాలకు కోర్టు ఆదేశాల మేరకు స్థలాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో, వారు నిరాశ్రయులుగా మారకుండా ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించారు. ఫలితంగా మొత్తం 64 కుటుంబాలకు పట్టా స్థలాన్ని మంజూరు చేయించగా, ప్రతి కుటుంబానికి 3 సెంట్ల చొప్పున పట్టాల్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మండల తహసీల్దార్ మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, ూవీజ చైర్మన్, పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పేదలకు పట్టాల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి

## ఊబిలో కూరుకుపోయిన గేదెను రక్షించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

**మచిలీపట్నం, మార్చి 17 :**
మచిలీపట్నం హౌసింగ్ బోర్డు నుండి చిట్టీపాలెం వెళ్లే రోడ్ ప్రక్కన(సత్యా కన్వెన్షన్ హాల్ ఎదురుగా )లోతైన కాలువలో మంగళవారం సాయంత్రం గేద చిక్కుపోయింది. రహదారిపై వెళ్లేవారు ఎంత ప్రయత్నించినా బయటకి తీయలేకపోవటంతో ఆఖరికి అగ్ని మాపక సిబ్బంది వచ్చి అతిప్రయాస పై బయటకుతీశారు. జర్నలిస్తులకు ఇండ్లస్థలాల పంపిణీకి తొలినమెరక తోలిన మరోప్రక్క రోడ్ కి మధ్య ఏర్పడిన కాలువ తవ్వటంతో చాలా లోతున్నందువలన గేదె ఇరుక్కుపోయిందని అగ్ని మాపకశాఖ ప్రతినిధి తెలిపారు.

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 17 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సహకారంతో టీడీపీ సీనియర్ నాయకులు నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ సీనియర్ నాయకులు నర్సిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్రామాల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనయే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే గ్రామ సుపరిపాలన సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న టీడీపీ నేత నర్సిరెడ్డి



బాపులదొడ్డిలో సీసీ రోడ్డు నిర్మాణ జరుగుతున్న దృశ్యం





మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి . పాల్గొన్న నాయకులు

# బనవాసి ఫారం సందర్శన

**ఎమ్మెల్యే డా.బి.వి.జయ నాగేశ్వర రెడ్డి ..**

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 17 :**
బనవాసి ఫారంను ఎమ్మెల్యే డా.బి.వి.జయ నాగేశ్వర రెడ్డి మంగళవారం సందర్శించారు. మొదటగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఈ సంవత్సరానికి వ్యవసాయ ఖర్చుల కోసం ప్రభుత్వం అందిస్తున్న రూ.20,000 ఆర్థిక సహాయం గురించి గ్రామస్థులు, రైతులకు వివరించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధి మరియు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. గ్రామంలోని సందర్శించి, కొత్త రహదారులు, డ్రైనేజీలు, ప్రజా సమస్యలు మరియు పారిశుద్ధ్య అంశాలపై సంబంధిత శాఖ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, మండల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, అధికారులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





ఇంటింట ప్రచారం చేస్తున్న కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజా నందు

## అన్నదాత-సుఖీభవ ఇంటింట ప్రచారం

**కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజా నందు**

**కౌతాళం (తెలుగోడు), మార్చి 17 :**
మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేందర్ రెడ్డి, కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు ఆదేశాల మేరకు కౌతాళం టౌన్‌లో రెండవ రోజు అన్నదాత సుఖీభవ 3వ విడత ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతన్నల ఖాతాలో పెట్టుబడి సహాయ నిధి జమ చెయ్యడం జరిగినది. కౌతాళం టౌన్ నందు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెట్టుబడి సహాయం, ప్రకృతి వ్యవసాయం,ప్రభుత్వం అన్నదాత కోసం సబ్సిడీ రూపంలో అందిస్తున్న వ్యవసాయ ఆధారిత పరికరాలు ,వడ్డీ లేని రుణాలు మరియు సాంకేతిక జోడించి లాభసాటి గురించి తెలియజేయ్యడం జరిగినది.ఈ కార్యక్రమములో కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజానందు , తెలుగు యువత నాయకులు ముకన్న , గొట్టయ్య, రేవన్న, అయ్యప్ప ం వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



ఇంటింట ప్రచారం చేస్తున్న కౌతాళం టౌన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజా నందు

## నేటితో ముగియనున్న పాలకవర్గం గడువు

**మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ప్రత్యేకాధికారుల పాలన ..**

**అమరావతి, మార్చి 17:**
రాష్ట్రంలో 75 మున్సిపాలిటీలు, 11 కార్పొరేషన్లలో పాలకవర్గం గడువు నేటితో ముగియనుంది. ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు రేపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికలు జరిగి కొత్త పాలక వర్గం ఏర్పడే వరకు వీరే పాలన చూసుకుంటారు. ఇక ఏలూరు కార్పొరేషన్కు జులై 29, మరో 13 పురపాలికల్లో నవంబర్ 21తో గడువు ముగియనుంది. అటు పంచాయతీల్లో ఏప్రిల్ 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.









ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు . కళాకారుల విన్యాసాలు

## మహాదుర్గ అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు..

**శ్రీశైలం (తెలుగోడు), మార్చి 17 :**
శ్రీశైల మహా క్షేత్రంలో జరుగుతున్న ఉగాది ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం నాడు శివపార్వతులు కైలాస వాహనంపై దర్శనమిచ్చారు. భ్రమరాంబా దేవి మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా స్వామి అమ్మవార్లకు అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాల పూజలు అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకరణ మండపంలో ప్రత్యేక పూలతో నూతన వస్త్రాలతో అలంకరింపజేయించి అలంకరణ పూజలను అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు మరొకమారు మంగళహారతులు ఇచ్చి మేళతాళాల నడుమ మంగళ వాయిద్యాల నడుమ కళాకారుల విన్యాసాల నడుమ ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. గ్రామోత్సవం వైభవంగా శ్రీశైలం పురవీధుల్లో ముందుకు సాగింది. స్వామి అమ్మవార్లను చూసి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. ఈ విశేష కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు, ఆలయ అర్చక వేద పండితులు, అధికారులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కైలాస వాహనంపై దర్శనమిచ్చిన ఆది దంపతులు





ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న అర్చక స్వాములు





గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు









గ్రామోత్సవంలో విన్యాసాలు చేస్తున్న కళాకారులు

## చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా.. హరీష్ శంకర్



ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు.

ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు అని ప్రశంసించారు.

## విడుదలకు ముందే దురంధర్ కలెక్షన్లు....ప్రీ రిలీజ్ కోసం 130 కోట్లు




బాక్సాఫీస్ వద్ద మరోసారి కలెక్షన్ల వర్షం సృష్టించేందుకు 'ధురంధర్ 2' సిద్ధమవుతోంది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రికార్డులు కొల్లగొడుతోంది. 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం, కేవలం అడ్వాన్స్ సేల్స్ ద్వారానే వంద కోట్ల క్లబ్‌లో చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. పెయిడ్ ప్రివ్యూల్లోనే కోట్లు వసూలుచేస్తోంది. ఈ కలెక్షన్లు చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' ప్రభంజనం ఏ స్థాయిలో ఉండనుందో తెలుస్తోంది. భారీ అంచనాల మధ్య ఉగాదికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రివ్యూలు ఉండనున్నాయి. దీంతో దీని టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడైనట్లు తెలుస్తోంది. ప్రివ్యూల ద్వారా రూ.40.54 కోట్లు, మొదటిరోజు అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.29 కోట్లు వచ్చాయని సినీ వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటు ఓవర్సీస్‌లో సుమారు రూ.60 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయని సమాచారం. దీంతో మొత్తంగా ఈ సినిమా విడుదలకు రెండు రోజుల ముందే రూ.130 కోట్లు తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా 15,000 థియేటర్లలో ఈ సినిమాను ప్రదర్శించ నున్నారు. ఇప్పటివరకూ 4.7లక్షల టికెట్లు అమ్ముడైనట్లు తెలుస్తోంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఇది విడుదలవుతోంది. దాదాపు 3 గంటల 55 నిమిషాల నిడివి ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. నిడివి, సెన్సార్‌పై అధికారిక సమాచారం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ప్రభాస్ ..ఫౌజీ దసరాకు పక్కా శరవేగంగా సాగుతున్న షూటింగ్




ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఆసక్తికరంగా విశ్వనాథ్ అండ్ సన్స్ టీజర్




నువ్వు ఒక్క చిటికేస్తే నీ వయసు అబ్బాయిలు చాలా మంది ఇలా వచ్చి పడిపోతారని సూర్య చెప్పడం.. కావాలంటే ఇంకో నాలుగు చిటికెలేస్తా. నువ్వు పదు చాలు' అంటూ మమిత క్యూట్‌గా బదులివ్వడం విశ్వనాథ్ అండ్ సన్స్' మూవీ టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు ఇదే ట్రెండ్ అవుతోంది. మనం గొప్ప అనుకున్న ప్రతిసారీ మనకన్నా గొప్పోడు ఒకడుంటాడని దేవుడు గుర్తు చేస్తాడు అంటున్నారు కథానాయకుడు సూర్య. ఇప్పుడాయన నుంచి రానున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మమితా బైజు కథానాయిక. ఈ చిత్రం జులైలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. 'సంజయ్ విశ్వనాథ్ గతంలో ఎన్నో పిస్టల్ కాంపిటేషన్స్‌లో గెలిచారు. కానీ, ఇప్పుడు వేరు. కంటి చూపుకి 20ల్లో ఉన్న ఫిట్‌నెస్ 40 దాటాక ఉండదు' అనే డైలాగ్‌తో సూర్య పాత్రను పరిచయం చేస్తూ టీజర్ సాగిన తీరు ఆద్యంతం అలరించింది. దీంట్లో మ్యాడీగా మమితా బైజు చేసిన సందడి ఆకట్టుకుంది. ఆమె వయసులో తనకంటే 20ఏళ్లు పెద్దవాడైన హీరోపై మనసు పారేసుకోవడం.. ఈ ఇద్దరి మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథ ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు ఈ ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది. ఆఖర్లో '

## వివాదంలో సర్కే చునర్ తేరీ సాంగ్



కన్నడ నటుడు ధ్రువ సర్జా కథానాయకుడిగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'ఐఆ: ది డెవిల్' భారీ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని 'సర్కే చునర్ తేరి సర్కే' అనే స్పెషల్ సాంగ్ అశ్లీలంగా ఉందంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పాటపై నిషేధం విధించాలని కోరుతూ ముంబైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌తో పాటు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశాడు. ఈ పాటలోని సాహిత్యం మరియు దృశ్యాలు అత్యంత అశ్లీలంగా, అసభ్యకరంగా ఉన్నాయని, ముఖ్యంగా మైనర్లకు హాని కలిగించే విధంగా ఉన్నాయని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. యూట్యూబ్ మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విచ్చలవిడిగా ప్రచారంలో ఉన్న ఈ పాట, పబ్లిక్ డెన్సీని దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఈ పాటలో ఉపయోగించిన పదజాలం మరియు నృత్య రీతులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇది సమాజంలో అసభ్యతను ప్రోత్సహిస్తుందని జిందాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాటకు సాహిత్యం రాసిన రాకీబ్ ఆలం, దర్శకుడు ప్రేమ్, సంగీత దర్శకుడు అర్జున్ జన్య మరియు గాయని మంగ్లీ వంటి వారిని కూడా ఈ ఫిర్యాదులో ప్రస్తావించాడు. ఇప్పటికే ఈ అంశంపై ఢిల్లీ పోలీస్ సైబర్ సెల్‌లో కూడా విడిగా క్రిమినల్ ఫిర్యాదు నమోదైందని, పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ పాటను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.

## గాడ్ ఫాదర్ దర్శకుడితో పవన్ మూవీ అంటూ ప్రచారం



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, మరోవైపు సినిమాలను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఆయన కొత్త ప్రాజెక్టుల గురించి ఏదో ఒక వార్త హల్చల్ చేస్తూనే ఉంది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో దర్శకుడు మోహన్ రాజా, పవన్ కళ్యాణ్ కాంబినేషన్‌లో ఒక భారీ సినిమా రాబోతుందంటూ వినిపించిన వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. పవర్ స్టార్‌తో సినిమా గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టమైంది. పవన్ నెక్స్ లైనప్‌లో ఉన్న సినిమాల్లో ఓజీ సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌తో పాటు హరిహర వీరమల్లు పార్ట్ 2 కూడా ఉంది. అలాగే.. సురేందర్ రెడ్డితో ఓ సినిమా చేయబోతున్నారు. నెక్ట్స్ పవన్ నుంచి ఇమ్మీడియేట్‌గా సెట్స్ పైకి వెళ్లనున్న సినిమా సురేందర్ రెడ్డిదే. ఓజీ, వీరమల్లు సీక్వెల్స్ ఎప్పుడు ఉంటాయనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతానికైతే.. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.